ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబర్ 2025
5
కర్నూలు

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

ఇంటికొకరు..!

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- డెంగీతో గోనెగండ్లలో బాలుడు మృతి
- చర్యలు చేపట్టని అధికారులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీజనల్ జ్వరాలు వణికిస్తున్నాయి. వాటిలో డెంగీ కేసులే అధికంగా ఉన్నాయి. డెంగీ కేసులు పెరుగుతుండటంతో జిల్లా వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా ఇంటికొకరు జ్వరం బారిన పడి చికిత్స పొందుతున్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

కర్నూలు జిజిహెచ్‌లో ఒపి కోసం క్యూ కట్టిన రోగులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నపెద్దా అనే తేడా లేకుండా వాతావరణ మార్పులతో వైరల్ ఫీవర్స్‌తో ప్రతి ఒక్కరూ బాధపడుతు న్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు భారీగా కేసులు పెరుగుతున్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌ల్లో, ఎమ్మిగనూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగాయి. ఈ ఓపీ కేసుల్లో 60 శాతం వైరల్ ఫీవర్స్‌గా నమోదవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులకు, గొంతునొప్పి లక్షణాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. గత నెలతో పోలిస్తే వైరల్ ఫీవర్ కేసులు ఈనెల అధికంగా వస్తున్నాయి. ఇంట్లో ఒకరు తర్వాత మరొకరు విషజ్వరా లతో అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు మాత్రమే తగ్గడం లేదని రోగులు మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని జీజీహెచ్‌లు, డోన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు ప్రైవేటు ఆసుపత్రులు, రోగులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఓపీకి 2700 మంది రోగులు వచ్చేవారు. పది రోజులుగా ఈ సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఓపీకి వచ్చే రోగుల సంఖ్య 3వేలు దాటుతోంది. వీరిలో ప్రతి రోజూ 200 మంది దాకా అడ్మిషన్ పొందుతున్నారు. ఇందులో 70 శాతం వైరల్ ఫీవర్ కేసులు ఉండటం కలవరపెడుతోంది. నంద్యాల జీజీహెచ్‌లో కూడా ఓపీ రోగుల సంఖ్య 1300 నుంచి 1500 దాకా నమోదవుతున్నాయి. ఇక ఆదోని ఆసుపత్రిలో రోజు వారి ఓపీ 800 దాటుతోంది. విషజ్వరాలు పెరగడంతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షల కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో 2024లో 225 డెంగీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 203 కేసులు నమోదయ్యాయి. సస్పెక్టెడ్ కేసులు 2024లో 1285 కేసులు రాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 2224 కేసులు వచ్చాయి. మలేరియా కేసులు 2024లో 17 రాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 9 కేసులు నమోదయ్యాయి. చికెన్ గున్యా కేసులు 2024లో 10 నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 11 కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. నంద్యాల జిల్లాలో 95 డెంగీ కేసులను గుర్తించారు. మలేరియా కేసులు 12గా గుర్తించారు. బేతంచెర్ల, నందికొట్కూరు, డోన్, నంద్యాల ప్రాంతాల్లో డెంగీ వ్యాధిగ్రస్థుల సంఖ్య అధికంగా ఉంది.

● ప్రయివేటు దోపిడీ

వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటాన్ని ప్రయివేటు ఆస్పత్రులు ఆదాయంగా మలచుకుంటున్నాయి. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళితే చాలు తొలుత టెస్టుల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్(రక్తపలికలు) తగ్గాయన్న పేరుతో ఆస్పత్రిలో చేరాలని భయపెడుతున్నారు. ఆస్పత్రిలో చేరితే మందులు, బెడ్ ఛార్జీలు, డాక్టర్ ఫీజులు తదితర పేర్లతో దోచుకుంటున్నారు. ఏకంగా లక్షలు వసూలు చేస్తూ రోగుల జేబులు ఖాళీ చేస్తున్నారు.

● పత్తాలేని పరీక్షలు

ఉమ్మడి జిల్లాలో పలు ఆసుపత్రుల్లో డెంగీ కిట్లు ఉన్నప్పటికీ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. డెంగీతో పాటు వర్షాలు కురుస్తుండటంతో నీరు కలుషితం కావడంతో టైఫాయిడ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. గ్రామాల్లో రెండు మూడు రోజులకు వైద్య సిబ్బంది చికిత్సలు అందించేందుకు వెళ్లడం లేదు. అన్ని పీహెచ్‌సీలో మధ్యాహ్నం 1 గంట తర్వాత వైద్యులు ఇంటి ముఖం పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డెంగీ, మలేరియా పరీక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయి. రోగుల నుంచి సేకరించిన నమూనాలను కర్నూలు జిజిహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రులకు వ్యాధి నిర్ధారణకు పంపిస్తారు. ఈ వ్యాధులకు మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ డబ్బాలు ఇంటి పరిసరాలలో ఉంచకుండా. చూడాలి. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలి. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మరల నింపుకోవాలి. వాటర్ బ్యాంకులు, ఇంటిలో నీటి నిల్వల మీద దోమలు జొరబడకుండా మూతలు వేసి ఉంచాలి.

- నూకరాజు, జిల్లా మలేరియా అధికారి.

డెంగీ బారిన పడిన బాలుడు మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల ఎస్సీ కాలనీలో గత వారం రోజుల క్రితం డెంగీ బారిన పడిన నరహరి (2) కోలుకోలేక కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. గోనెగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన గుడిసె చిన్నరంగన్న, లక్ష్మీ దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. గతవారం రోజుల క్రితం వీరి ఒక్కగానొక్క కుమారుడు నరహరి తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా డెంగీ జ్వరంగా తేలింది. మూడు రోజుల క్రితం జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణుడుతో పాటు మండల వైద్య, పంచాయతీ సిబ్బంది బాలుని గృహానికి చేరుకొని పరిసరాలను పరిశీలించి ద్రావణాన్ని పిచికారి చేశారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న బాలుడు కోలుకోలేక శుక్రవారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

చాకలి ఐలమ్మ ఆశయాలు కొనసాగిస్తాం

- జయంతి సభలో వృత్తిసంఘాల నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

చాకలి ఐలమ్మ ఆశయాలు కొనసాగిస్తామని వృత్తి సంఘాల సీనియర్ నాయకులు జి.రామకృష్ణ, ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్ చెప్పారు. శుక్రవారం నగరంలోని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి ఓల్డ్ సిటీ కార్యదర్శి జయమ్మ, న్యూ సిటీ అధ్యక్షుడు సి.రాముడు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జి.రామకృష్ణ, సి.గురుశేఖర్, కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడారు. ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం సాయుధ రైతాంగ పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన వీర వనిత చాకలి ఐలమ్మ ఈతరం మనం చరిత్ర గుర్తుపెట్టుకోవాలని, ఆమె జీవిత చరిత్ర భావితరాలకు తెలియజేయాలని తెలిపారు. ఆమె పోరాట పటిమతో రజకులకు ఘన కీర్తిని సంపాదించి పెట్టారని చెప్పారు. రజాకార్లకు వ్యతిరేకం గా పోరాడుతున్న కమ్యూనిస్టుల సహకారం తో నిజాం నవాబు గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర మహాసభ జరుపుతున్న పోరాటంలో పాల్గొన్నారన్నారు. అప్పటి నిజాం సైన్యం రజాకారులు స్థానిక భూస్వామ్యల గుండాలతో కలిసి ఆమె ఇంటిపై దాడి చేసి ఇంట్లో వస్తువులను దోచుకుని ఇంటికి నిప్పు పెట్టారని, ఈ దాడి నుండి ఆమె తప్పించుకుందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాల న్నారు. రైతాంగ సాయుధ పోరాటం ఫలితంగా నిజాం నవాబులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారన్నారు. నేటికి కూడా రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణ జరుగుతున్నాయని, నివారణలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. అమలు చేయలేక పోతే భవిష్యత్తులో రజక వృత్తిదారులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా కమిటీ సభ్యులు రవిశంకర్, సూరి, పుష్ప, ఎల్ల రాజు, కర్నూలు నగర నాయకులు మద్దిలేటి, కర్రెన్న, చంద్రన్న, రమేష్, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

బన్నీ ఉత్సవాలకు ఏర్పాట్లు

- శాంతియుత వాతావరణంలో జరిగేలా సహకరించాలి
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - హోళగుంద

దేవరగట్టు బన్ని ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులు సహకరించాలని, ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. శుక్రవారం దేవరగట్టు గ్రామంలో బన్నీ ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి అధికారులు, గ్రామ పెద్దలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేవరగట్టు బన్నీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు 2 లక్షల మందికి పైగా జనం వచ్చే అవకాశం ఉన్నందున మౌలిక వసతుల ఏర్పాటు అత్యంత కీలకమని తెలిపారు. ఆయా ప్రభుత్వ శాఖలు అవసరమైన ఏర్పాట్లన్నీ ఉత్సవాలకు రెండు రోజులు ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లపై గుంతలు లేకుండా మరమ్మతులు చేయాలని తెలిపారు. గతేడాది కంటే అత్యధికంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరంగా ఉండేలా చూడాలని చెప్పారు. విద్యుత్ సరఫరా సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా, సమీపంలోనే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, కాలిన గాయాలు, పాముకాటుతో పాటు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం సకాలంలో స్పందించే విధంగా అంబులెన్స్‌లు సిగ్నల్ పాయింట్ల వద్ద మోహరించాలని సూచించారు. 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హోళగుంద పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్య చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు.అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడారు. గతంలో బన్నీ ఉత్సవాల్లో చెట్టుపైకి అధిక సంఖ్యలో భక్తులు ఎక్కడంతో ప్రమాదవశాత్తుగా నలుగురు మరణించారని, ఈసారి ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వంద సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కమ్యూనికేషన్ బాగా ఉండేందుకు, నెట్‌వర్క్ సమస్యలు తలెత్తకుండా తాత్కాలిక మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మద్యం వినియోగాన్ని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ... దసరా పండగ రోజు రాత్రి బన్నీ ఉత్సవాలు జరుగుతాయని, ఇందులో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొంటారని తెలిపారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మనోహర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, డిపిఒ భాస్కర్, డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ పాల్గొన్నారు.

మనేకుర్తి రైతులను బెదిరించడం జెసికి తగదు

- బలవంతపు భూసేకరణ ఆపాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 24న కర్నూలు జిల్లా ఆలూరు మండలం మన్నెకుర్తి గ్రామంలో పర్యటించిన జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య , అధికారులు రైతులను బలవంతంగా భూములు ఇవ్వాలని బెదిరించడం న్యాయం కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశులు, జి.రామకృష్ణ ఒక ప్రకటనలో ఖండించారు. రైతులు అష్టకష్టాలు పడుతున్నప్పటికీ గోరుచుట్టు పైన రోక టిపోటు మాదిరి గ్రామంలో పవర్ గ్రిడ్డు వచ్చి రైతులకు మరింత కష్టాలు తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు. 195 ఎకరాలు సారవంతమైన భూములలో పవర్ గ్రిడ్డు నిర్మాణం చేయవద్దని గ్రామస్తులందరూ ఐక్యంగా నిలబడి గ్రామసభలో 90 శాతంకు పైగా వ్యతిరేకించారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఏదేని ప్రాజెక్టు నిర్మించాలంటే 80శాతం ప్రజలు అంగీకరించాలని, అంగీకరించని ఎడల అక్కడ ఆ ప్రాజెక్టు నిర్మించకూడదని చాలా స్పష్టంగా చట్టం చెబుతుండగా ఇక్కడ అధికారులు రైతుల పైన ఏమాత్రం కనికరం లేకుండా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇదే గ్రామంలో చౌడు భూములు, సారవంతం కాని భూమిని సేకరించి పవర్ గ్రిడ్ నిర్మించవచ్చున్నారను. సారవంతమైన భూములు బలవంతంగా తీసుకుంటే గ్రామం యావత్తు ఖాళీ అయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇది జిల్లా అధికారులు గమనించి ప్రభుత్వానికి నివేదిక పంపి ఈ భూములను మినహాయింపు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈనెల 24న వచ్చినటువంటి అధికారులు మీరు మేము చెప్పినట్టుగా వింటే ఎకరాకు రూ.18 లక్షలు ఇస్తామని, లేని పక్షంలో కేవలం రూ.6 లక్షల మాత్రమే ఇచ్చి తీసుకోవలసి వస్తుందని చెప్పడం సమంజసంగా లేదన్నారు. రైతులను భయభ్రాంతులకు గురి చేయడమేంటని ప్రశ్నించారు. ఈ విషయం పత్రికలలో ప్రస్ఫుటంగా వచ్చిందని ఇకమీదట రైతులను బెదిరించే పద్ధతి కాకుండా ప్రత్యామ్నాయ పద్ధతులు ఆలోచన చేసి రైతులకు న్యాయం జరిగేలా జిల్లా ఉన్నతాధికారులు వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ఆ భూములను సేకరించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

అత్యవసర సేవలకు డయల్ 112

- జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజలు , బాధితులు అత్యవసర పరిస్థితులలో , ఆపద సమయాల్లో ఎమైనా సమస్యలు , అసాంఘిక కార్యకలపాలు ఎదైనా మీ దృష్టికి వస్తే వెంటనే డయల్ 112కి కాల్ చేసి సమాచారం అందించాలని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం తెలిపారు. గొడవలు, తగాదాలు, కుటుంబ సమస్యలు , అనుమానాస్పద వ్యక్తుల కదలికల వివరాలు ఎదైనా మీ దృష్టికి వచ్చినా కూడా వెంటనే డయల్ 112 కి జిల్లా ప్రజలు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డయల్ 112 కు కాల్ చేసినా వెంటనే స్పందించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బ్లూ కోల్ట్స్, రక్షక్, పోలీస్ వారు కేవలం 15 నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకొని సమస్యను తెలుసుకుని, తగిన చర్యలు తీసుకుంటారన్నారు. డయల్ 112 హెల్ప్ లైన్ నెంబర్ 24 కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానమై అందుబాటులో ఉంటుం దన్నారు. క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉన్న బ్లూ కోల్ట్స్, రక్షక్, పోలీస్ సిబ్బ ందికి క్షణాల్లో సమాచారం వెళ తుందన్నారు. జిల్లాలోని ప్రజలు గతంలో పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ గా ఉన్న డయల్ 100 నంబర్ కు బదులు హెల్ప్ లైన్ నెంబర్ డయల్ 112 నంబర్‌గా ప్రభుత్వం మార్చిందన్నారు. ఇటీవల కురు స్తున్న భారీ వర్షాల వల్ల జిల్లాలోని గ్రామాలు, పట్టణ శివార్లలో వాగులు, వం కలు, చెరువులు, కుంటలు, కాలువలు పూర్తిగా నిండిపోవడం , దసరా సెల వుల నేపథ్యంలో పిల్లలు, యువకులు ఈతకు వెళ్లడం వల్ల ప్రమాదకరమైన ఘ టనలు జరిగే అవకాశం ఉందని , తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో గమనించా లన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని, నదీతీరా ప్రాంతాల ప్ర జలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఎదైనా సమస్యలుంటే వెంటనే డ యల్ 112కు సమాచారం అందించాలని విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

-డాక్టర్ మహేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి సరయిన వైద్యం చేయించుకుంటే త్వరగా నయం అవుతుందనిరాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ సూచించారు. ముజఫర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన పాల్గొన్నారు. డాక్టర్.మహేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాలు, అపరిశుభ్రత, అబార్షన్ ఇతరత్రా కారణాలతో గర్భాశయ కేన్సర్ కలుగుతుందని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం ద్వారా వీటిని నివారించవచ్చునని తెలిపారు. ప్రాథమిక దశలో మొహమాటం కారణంగా వైద్య పరీక్షలకు ఆసక్తి చూపకపోతే ఇబ్బంది తప్పదని తెలిపారు. అసంక్రమిత వ్యాధుల సర్వేలో గుర్తించిన కేన్సర్ అనుమానితులను వైద్యుల ద్వారా నేరుగా ఇక్కడికి పంపించి నిపుణులతో పర్యవేక్షించాలన్నారు. ఇక్కడ ప్రతి మంగళ, గురువారాలలో నోటి, గర్భాశయ ముఖద్వార, రొమ్ము కేన్సర్ బాధితులకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. డిపిఎంయు డాక్టర్ ఉమా మాట్లాడుతూ ఓ కుటుంబం శక్తివంతంగా ఉండాలంటే ఆ ఇంటి వెలుగు అయిన మహిళా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. డాక్టర్ రోషిణి, డిపిఒ విజయరాజు, కన్సల్టెంట్స్ సుధాకర్, మల్లికార్జున, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలు - ప్రజలకు కష్టాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తుఫాను ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో ప్రజల కష్టాలు మొదలయ్యాయి. మొన్నటిదాకా ఉల్లి రైతుల కష్టాలు చూసాం. నేడు కురుస్తున్న వర్షాల వల్ల శివారు కాలనీలో నివాసం ఉంటున్న వారి కష్టాలు వర్ణనాతీతం. రోడ్లు లేక ఇంటి నుండి బయటికి కాలు పెడదామంటే బురద రోడ్ల నిండా నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక లోతట్టు ప్రాంతాల్లో రోడ్లు తగ్గులో ఉండడం వల్ల రోడ్లపై మోకాలు లోతున మురుగు నీటిలో తిరగాల్సిన పరిస్థితి ఉంది. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు నీళ్లలోనే తిరగాల్సిన పరిస్థితి ఉంది. నూతనంగా ఏర్పాటయిన కాలనీలలో రోడ్లు, మురుగు కాలువలు లేక ఇండ్లకు చేరే పరిస్థితి లేదు. చిన్నపిల్లలు, వయోవృద్ధులు బయట తిరిగే పరిస్థితి లేదు. ఎక్కడ అవకాశం ఉంటే వాహనాన్ని అక్కడ నుంచి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలోని ప్రజలందరితో ప్రతి ఏటా 15 శాతం ఇంటి పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ వారికి కనీస అవసరం లేనటువంటి తాగునీరు, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు కూడా వేయలేని పరిస్థితిలో నగరపాలక సంస్థ ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కమిషన్ల కక్కుర్తి తో బాగా ఉన్నటువంటి రోడ్ల పైన రోడ్లు వేస్తూ శివారు కాలనీలతో సమస్యలను పట్టించుకోవడం లేదంటున్నారు. నగరంలో కాలువలు కల్వర్టులు నిర్మించడం, డివైడర్ల మధ్యలో సుందరి కన్నా పేరుతో మొక్కలు పెంచేందుకు డివైడర్లు కట్టడం లాంటి పనులు చేస్తూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. వర్షాలు పడే సందర్భాల్లో కమిషనర్‌ను, తమ కాలనీలలో పర్యటనలు చేసి ఎక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారో గమనించి ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారంతో ప్రణాళికలు రూపొందించుకొని ప్రాధాన్యత క్రమంలో పనులను ప్రారంభించాలి. ప్రజల కష్టాలను దూరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డయల్ యువర్ కమిషనర్‌కు ఎన్ని సమస్యలు వచ్చినప్పటికీ వాటిని పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికల రూపొందించుకుని ముందుకు వెళ్లి ప్రజల మెప్పును పొందాలని ప్రజలు కోరుతున్నారు. అలా చేయని పక్షంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి ఆందోళనలు, ధర్నాలు చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి కార్యక్రమం శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయ కులు కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. దేశాన్ని ఆర్థిక అభివృద్ధికి అనేక చర్యలు ఆయన తీసుకున్నరని పేర్కొన్నారు. ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న సుధాకర్‌బాబు

ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు

డిఎల్‌పిఒ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ : గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీ ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని పత్తికొండ డిఎల్‌పిఒ రామచంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం పత్తికొండ మండల పరిధిలోని దేవనబండ , నలకదొడ్డి గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని పత్తికొండ డిఎల్‌పిఒ రామచంద్ర రెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు పారిశుధ్యం పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎప్పటికప్పుడు అందజేస్తూ అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచి ప్రవీణారెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ నరసింహులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉదాసీనం వైఖరిని వీడండి

-వెంటనే నోటీసులు జారీ చేసి, చార్జిషీట్ దాఖలు చేయండి

-ఎల్ఆర్ఎస్ పథకం క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలో అక్రమ నిర్మాణాలపై ఉదాసీన వైఖరిని వీడాలని, వెంటనే నోటీసులు జారీ చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ భవనంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సిబ్బందితో కలిసి ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించారు. పలువురు అర్జీదారులు తమ సమస్యలను చెప్పగా, జాప్యానికి కారణాలను అడిగి, చట్టపరిధిలో వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి సచివాలయ పరిధిలో సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, ఇతర కార్యదర్శుల సహాయం తీసుకుని అక్రమ నిర్మాణాలు గుర్తించాలని అన్నారు. అప్రూవల్ ఉందా? ప్లాన్ విరుద్ధంగా ఏమైనా నిర్మాణాలు చేస్తున్నారా? చెక్‌లిస్ట్ ప్రకారం పత్రాలు ఉన్నాయా? అనే అంశాలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. అందుకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు వెంటనే నోటీసులు జారీ చేసి, చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పథకంపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సిటీ ప్లానర్ ప్రదీప్, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్‌బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, సిబ్బంది అనంత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

విద్యారుణాల మంజూరులో శ్రద్ధ చూపాలి

-వ్యవసాయదారిత రుణాలు పట్ల అలసత్వం

-బ్యాంకర్ల కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో విద్యార్థులకు చదువుకునేందుకు విద్యా రుణాల మంజూరులో శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి బ్యాంకర్లను కోరారు. వ్యవసాయ ఆధారిత రుణాల పట్ల అలసత్వం తగదని అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఇ లోన్లు ఇప్పించడంలో పురోగతి తీసుకు రావాలన్నారు. కోల్డ్ స్టోరేజ్, రూరల్ గోడౌన్ లాంటి ప్రతిపాదనలు ఏమైనా ఉంటే బ్యాంక్ అధికారులకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు... లైవ్ స్టాక్ లోన్లు ఎక్కువ మందికి ఇప్పించే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే జిడిపి, తలసరి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రం ద్వారా స్వయం ఉపాధి కార్యక్రమాల్లో భాగంగా శిక్షణతో పాటు ఉపాధి కల్పనకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఎల్‌డిఎం రామచంద్ర రావు, నాబార్డ్ డిడిఎమ్ సుబ్బారెడ్డి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రామకృష్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ నరసింహారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ హార్ట్ డే వేడుకను జయప్రదం చేయాలి

హెల్త్ వర్సిటీ విసి డాక్టర్ చంద్రశేఖర్



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల 28న ఆదివారం జరుగనున్న వరల్డ్ హార్ట్ డే వేడుకలను జయప్రదం చేయాలని డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడా లేనివిధంగా 2002లో కర్నూలు నగరంలో వైద్యనిపుణులు, మేధావులతో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ స్థాపించామని ఆయన తెలిపారు. 2005 నుంచి ప్రతి ఏటా కర్నూలులో వరల్డ్ హార్ట్ డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది వరల్డ్ హార్ట్ డే సందర్భాన్ని పురస్కరించు కుని దేశంలోనే పేరొందిన ప్రఖ్యాత వైద్య నిపుణులను 'అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో సన్మానిస్తున్నామని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఏడాది వరల్డ్ హార్ట్ డే వేడుకల్లో హైదరాబాద్ అపోలో హాస్పిటల్ కు చెందిన ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రతాప్ చంద్ర రత్ కు ఈ అవార్డు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు స్థానిక ఎ.క్యాంప్ లోని కర్నూలు హెల్త్ క్లబ్ లో నిర్వహించనున్న వరల్డ్ హార్ట్ డే వేడుకలకు గౌరవ అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, మాజీ రాజ్యసభ సభ్యుడు టిజి.వెంకటేష్, కర్నూలు ఎంపి బస్తి పాటి నాగరాజు తదితరులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ డాక్టర్ సిరి - ప్రభుత్వాస్పత్రి, సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి -ఆలూరు

సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సచివాలయ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని దేవరగట్టులో అధికారులతో సమీక్ష అనంతరం ఆలూరులోని సచివాలయం-2ను, ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సచివాలయానికి వచ్చే బాధితులు, ప్రజల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. వలసలు వెళ్లే పిల్లలను, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చదివించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఇఒకు సూచించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న చికిత్స, సేవలు, ఆహారం, మందులపై రోగులను అడిగి ఆరా తీశారు. పిల్లలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. విధుల పట్ల, రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. ఆర్‌డిఒ భరత్ నాయక్, డిసిహెచ్‌ఎస్ జఫ్రుల్లా పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం

స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

పాత రేషన్ కార్డు స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. శుక్రవారం గోనెగండ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ రఘువీరా, ఆర్ఐ రామయ్య, టిడిపి కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, సొసైటీ ఛైర్మన్ ఎన్‌వి.రామాంజనేయులు, సీనియర్ నాయకులు శ్రీధర్ నాయుడు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... మండలంలోని 23,375 పాత రేషన్ కార్డుల స్థానంలో ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. ఈ కార్డుల్లో కార్డుదారుని పేరు, కార్డు నెంబరు, రేషన్ షాపు నెంబరు, ఫొటోతో పాటు క్యూఆర్ కోడ్ ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు కార్డుపై ముద్రించిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల పేరు, లింగం, వయస్సు, సంబంధం, ఈకేవైసి స్థితి, రేషన్ కేటాయింపు, రేషన్ తీసుకున్న సరుకుల వివరాలు తెలుస్తాయన్నారు. అలాగే రేషన్ షాపులలో కొత్తగా ప్రవేశ పెట్టిన డిజిటల్ ఈ-పాస్ పరికరాల ద్వారా డిజిటల్ కార్డులను ఉపయోగించి సరుకులు సులభంగా పొందవచ్చని తెలిపారు. గోనెగండ్ల విఆర్ఒ నారాయణ, టిడిపి నాయకులు చంద్ర, రంగస్వామి నాయుడు, రహంతుల్లా, షేక్షావలీ, జిలాని, రాంపురం రఫిక్, రవితేజ పాల్గొన్నారు.

'పోషకాహారంతో ఆరోగ్యం పదిలం'

పజాశక్తి - ఆదోని

సీమంతం చేస్తున్న అధికారులు

పోషకాహార లోపం వల్ల రక్తహీనత ఏర్పడి ఆరోగ్యం క్షీణిస్తుందని, సమతుల్య ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ ఢిల్లీశ్వరి తెలిపారు. శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు బాలింతలకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ పోషణ మహా కార్యక్రమం జరపాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం తగ్గించేందుకు 'రాష్ట్రీయ పోషణ్ మహా' నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కురుస్తున్న వర్షం.. కుదేలైన పత్తి..!

• అధిక వర్షాలతో రైతులకు కునుకు కరువు

ప్రజాశక్తి - నందవరం

ఈఏడాది కురుస్తున్న అధిక వర్షాలతో పత్తి పంట కుదేలైంది. ఎడతెరపీ లేని వర్షం రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. వర్షంలో చెట్టుపై ఉన్న పత్తిని తీసుకోలేక, కష్టంగా తీసుకున్నా తడిగా ఉన్న పత్తిని ఆరబెట్టుకోవడానికి వాతావరణం అనుకూలించడం లేదు. మార్కెట్‌కు అలాగే తరలించినా అమ్ముకోలేక దిక్కుతోచని స్థితిలో రైతులు అయోమయంలో ఉన్నారు.

మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం విస్తీర్ణం 51 వేల ఎకరాలు. అందులో 35 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేసినట్లు ఎఒ సరిత తెలిపారు. గత నాలుగు నెలలుగా వర్షం రైతుకు కునుకు లేకుండా చేస్తోంది. విత్తనం వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యం వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ముందు సాగు చేసిన పత్తి పంట వైరస్ సోకి, అలాగే తేమ వల్ల మొగ్గలు, కాయలు, పూత రాలి చాలా చోట్ల పూర్తిగా దెబ్బతినింది. తర్వాత సాగు చేసిన పత్తికి వర్షాలు అనుకూలించి ఏపుగా పెరిగాయి. పంట చేతికి వస్తుందన్న సమయానికి వర్షం మరీ విజృంభించడం వల్ల పంట దెబ్బతినింది. వచ్చిన కొద్దిపాటి పంటకు కూడా గిట్టుబాటు ధర రావడం లేదు. పత్తి తడిగా ఉందంటూ రూ.4 వేలకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. పంట దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి పంటలో నిల్వ ఉన్న వర్షపు నీరు

అప్పుల భారం తప్పడం లేదు

- చుక్క మల్లేష్, నందవరం గ్రామం

ప్రతేడాది మాదిరిగానే ఈఏడాది కూడా అప్పుల భారం తప్పేలా లేదు. 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశాను. ఎకరాకు రూ.40 వేల పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు.

మార్కెట్ నుంచి తిరిగి పంపించారు

- చాకలి చిన్న బసవరాజు, నందవరం గ్రామం

వేల రూపాయలు అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. కూలీలకు వేతనాలు చెల్లించలేని స్థితిలో ఉన్నాం. కూలీలకు వేతనాలను చెల్లించడానికి వచ్చిన పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లాను. పత్తి తేమగా ఉంది.. కొనుగోలు చేయాలేమని మార్కెట్ వ్యాపారులు నన్ను తిరిగి పంపించారు. వేరే మార్గం లేక ఇంటికి తిరిగి తీసుకొచ్చాను. రూ.2 వేలు వాహనం ఖర్చు అధిక భారం పడింది. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని కేటాయించి మమ్మల్ని ఆదుకోవాలి.

జాతీయస్థాయి పోటీలకు 'విజ్ఞాన్' విద్యార్థిని

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బోయ ఉమామహేశ్వరి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మోహన్, ప్రధానోపాధ్యాయులు ఉషాపరిమళ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని ఉమా మహేశ్వరికి మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల ఎమ్మిగనూరులో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫుట్‌బాల్ పోటీల్లో ఉమా మహేశ్వరి పాల్గొన్నారని తెలిపారు. పలు జిల్లాల నుంచి దాదాపు 230 మంది క్రీడాకారులు పాల్గొనగా పట్టణానికి చెందిన ఉమామహేశ్వరి తన వ్యక్తిగత ప్రతిభను చాటి ఐదు గోల్స్ సేవ్ చేసి గోల్ కీపర్‌గా ఎంపికయ్యారని చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఎంపికకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు రామును ప్రత్యేకంగా కొనియాడారు. పాఠశాల సిబ్బంది సతీష్, కేశవ, రవికుమార్, విద్యార్థి తల్లిదండ్రులు బోయ శ్రీనివాసులు, బోయ సుజాత పాల్గొన్నారు.

ఉమామహేశ్వరిని ప్రశంసిస్తున్న మోహన్, ఉషా పరిమళ

అభివృద్ధిపై చర్చించాం

- ఎమ్మెల్యేను కలిసిన విజయకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

ఆదోని అభివృద్ధిపై ఎమ్మెల్యే పార్థసారథితో చర్చించామని మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా నియమితులైన అదూరి విజయకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యేను విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపామన్నారు. అక్టోబర్ 4న మార్కెట్ యార్డు పాలకమండలి ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించాలన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని 'సైకో' అంటూ మాట్లాడడం సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు తగదని, ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశించి అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ ఉపయోగించిన భాష, సంస్కారం చూస్తే ఆయన స్థాయి ఏమిటో మరోసారి ప్రజలకు అర్థమవుతుందని తెలిపారు. నలుగురికి ఆదర్శంగా ఉండాల్సిన ఒక సీనియర్ నటుడు, ఎమ్మెల్యే ఇంతటి నీచమైన పదజాలాన్ని, భాషను ఉపయోగించడం బాధాకరమన్నారు. ఈ వ్యాఖ్యలు బాలకృష్ణ వ్యక్తిత్వ లోపాన్ని, టిడిపి నాయకత్వం దిగజారుడుతనాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. బాలకృష్ణ మరిచిపోయి ఉంటారని, వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిగినప్పుడు ఆ విషయాన్ని వైఎస్ఆర్ ఏమాత్రం రాజకీయానికి వాడుకోలేదని తెలిపారు. రాజకీయానికి వాడుకుని ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో బాలకృష్ణ గుర్తు చేసుకోవాలని చెప్పారు. పదవుల్లో ఉన్నవారు హుందాగా ప్రవర్తించాలన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడి విలువను దిగుదార్చుకున్నారని తెలిపారు. సినిమాల్లో గొప్ప సందేశాలిస్తారని, వాస్తవ రూపంలో ఆయన ఎలా ప్రవర్తిస్తారో ప్రజలందరికీ తెలుసని అన్నారు.

చిరంజీవికి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

- మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రముఖ సినీ నటుడు, పద్మ విభూషణ్ కొణిదెల చిరంజీవి పట్ల వ్యంగ్యంగా మాట్లాడిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని, లేకపోతే మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్, జనసేన నాయకుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షులు, జనసేన పార్టీ నాయకులు బీసీ.నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. బాలకృష్ణ తనకు తాను అతీత శక్తిగా భావించుకుని మెగా కుటుంబంపై అనేక సార్లు అవమానకరంగా మాట్లాడారని, చిరంజీవి వివాదాలకు దూరంగా ఉంటూ విమర్శించే వారిని కూడా ఏమీ అనేవారు కాదని తెలిపారు. బాలకృష్ణ చట్టసభల్లో చిరంజీవి ప్రతిష్టను దిగజార్చే విధంగా మాట్లాడడం తగదని చెప్పారు. ఈ మాటలు చిరంజీవిని కూడా బాధించాయనడానికి ఆయన ప్రతిస్పందనే నిదర్శనమన్నారు. మరోసారి నోరు జారితే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

మాట్లాడుతున్న నాగరాజు



రికార్డులను పరిశీలిస్తున్న లక్ష్మి కాంత్ రెడ్డి

రుణ రికార్డులు స్వాధీనం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆస్పరి

'ఆస్పరి సొసైటీలో అక్రమాలు' అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు జిల్లా సొసైటీ సహకార సంఘం అధికారులు స్పందించారు. శుక్రవారం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్, పత్తికొండ సబ్ డివిజన్ కోఆపరేటర్ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి ఆస్పరి సొసైటీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. 2013 పిగ్మీ ద్వారా డిపాజిట్ అయిన డబ్బులతో ఇచ్చిన రుణాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. త్వరలో రుణాల రికార్డులను పరిశీలించి వాస్తవ విషయాలను వెలుగులోకి తెస్తామని తెలిపారు. ఈ రికార్డు పరిశీలనలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు తెలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పక్కా ప్రణాళికతో ఓటరు జాబితా

- ఆలూరు ఎన్నికల అధికారి అజయ్ కుమార్

ప్రజాశక్తి - చిప్పగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోనూ పక్కా ప్రణాళికతో ఓటరు జాబితాను రూపొందించాలని ఆలూరు ఎన్నికల అధికారి అజయ్ కుమార్ రెవిన్యూ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2022లో ఉన్న 22,653 జాబితాలో 2025 నాటికి 17,120 మంది ఉన్నారని తెలిపారు. 35 ఏళ్ల పైబడిన వారు 5,558 మంది ఉన్నట్లు చెప్పారు. నూతనంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి, ఓటరు జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు. తప్పొప్పులుంటే సరిదిద్దుకోవడానికి 15 రోజులు సమయం ఉంటుందన్నారు. ఓటరు జాబితా ఏమైనా ఫిర్యాదులుంటే నెల సమయంలోపు విచారించి జాబితాను తయారు చేస్తామన్నారు. ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

'వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి'

ప్రజాశక్తి - కోసిగి

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎంఆర్‌పిఎస్ నాయకులు, మహజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప, ఎంఆర్‌పిఎస్ మండల అధికార ప్రతినిధి మొండి నరసింహులు, మంత్రాలయం ఇన్‌ఛార్జీ నాగరాజు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటంతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అశువులు బాసిన ఉద్యమకారులకు, అలుపెరుగని పోరాటాలు చేసిన మాదిగ కులస్తులకు రుణపడి ఉండాలన్నారు.

షూరిటీ లేకుండా వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాలు

-పిఎం స్వనిధి 2.0ను సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని వీధి వ్యాపారులకు, కాలినడకన వ్యాపారాలు చేసుకునే వారికి పిఎం స్వనిధి 2.0 పథకం ద్వారా షూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు ఇస్తున్నట్లు ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోందని, లోక్ కల్యాణ్ మేళా (పిఎం స్వనిధి యోజన)ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. అర్హత కలిగిన వ్యాపారులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర బ్యాంక్, కెనరా బ్యాంకు, స్టేట్ బ్యాంకుల్లో రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు రుణ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఈనెల 29న ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ హాలులో వీధి వ్యాపారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నామని, బ్యాంకు అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆహార భద్రత, డిజిటల్ సేవలపై అవగాహన కల్పించి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. యుపిఐ, లింక్‌డ్ రూపే క్రెడిట్ కార్డుల మంజూరుపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. వీధి వ్యాపారులు, కాలినడక వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తమలపాకులు, వక్కలతో అవ్వ అలంకారం

ప్రజాశక్తి - ఆదోని రూరల్



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వను శుక్రవారం ఐదో రోజు తమలపాకులు, వక్కలతో అలంకరించారు. ప్రజలందరూ అవ్వను దర్శించుకుని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య కోరారు.

పుర ప్రగతి.. నత్తతో పోటీ..!

- పాలకులు మారినా మెరుగుపడని ఆదోని పురోగతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పుర ప్రగతి నత్తతో పోటీ పడుతోంది. పాలకులు మారినా పురోగతి కనిపించడం లేదు. ఆదోనిలో వర్షం విస్తారంగా కురిసింది. వర్షం కురిసిన ప్రతిసారీ పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. మురుగు కాలువలు పొంగిపొర్లడంతో నీరు పల్లపు ప్రాంతాల్లో నిలుస్తోంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్న పరిస్థితి ఉంది.

పట్టణంలోని కొత్తబస్టాండ్ ఆవరణం, పాతబస్టాండ్ మైదానం, తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణం, కోర్టు ఆవరణం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణం బురదమయమవుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

పాలకులు మారినా మెరుగుపడని సౌకర్యాలు

ఆదోనిలో సుమారు 2 లక్షల జనాభా ఉంది. ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నా సౌకర్యాలు మాత్రం మెరుగుపడడం లేదు. ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితుల్లో ఫ్లై ఓవర్, శిథిలావస్థకు చేరిన బ్రిడ్జికి మరమ్మతులు చేయిస్తామని, కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పార్థసారథి ప్రతి సమావేశంలోనూ చెబుతున్నారు. కార్యరూపం దాల్చని పరిస్థితి ఉంది. ఆ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో భారీ వాహనాలకు అనుమతి లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ రోడ్డు, పండిట్ నెహ్రూ రోడ్డు, మున్సిపల్ మెయిన్ రోడ్డు ప్రాంతాలు ఎప్పుడూ రద్దీగానే ఉంటున్నాయి. రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభిస్తూ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని.. రోడ్ల వెడల్పు అంటూ సర్వేలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి ఆదోని పర్యటనకొచ్చి రోడ్ల వెడల్పునకు రూ.65 కోట్లు ఇస్తున్నామని ప్రకటించారు. ఆ నిధులను రాబట్టడంలో అప్పటి పాలకులు వైఫల్యం చెందారు.

మున్సిపల్ కార్యాలయం ముందు చిత్తడి

పట్టణంలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించే మున్సిపల్ కార్యాలయం చిత్తడిలోనే ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా మున్సిపల్ మెయిన్ రోడ్డు నుంచి గేటు మీదుగా పల్లపు ప్రాంతంలో ఉండే మున్సిపల్ కార్యాలయం ఆవరణ ముందు నీరు నిలుస్తోంది. ప్రధాన గేట్ వద్ద కూడా మురుగునీరు నిలవడంతో కార్యాలయంలోకి వచ్చేవారు మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించారు. నిర్మాణం మొదట్లోనే అప్పటి ఇంజినీర్లు కనీసం డ్రెయినేజీ సదుపాయం కూడా కల్పించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిత్యం ప్రజా సమస్యలపై మాట్లాడే కౌన్సిలర్లు కనీసం కార్యాలయం పరిసరాల అపరిశుభ్రత గురించి మాట్లాడకపోవడం విచారకరం. మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మురుగునీరు నిలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్యలో నిలిచిన నీరు

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలి

ఆదోని అభివృద్ధికి అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలి. చిన్నపాటి వర్షం కురిసినా పల్లపు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆదోనిలో ఆవదూడ వంకపై అక్రమ కట్టడాలు వెలిశాయి. ఇటీవల రాంజల చెరువు పొంగి వంక ద్వారా నీరు పారింది. 12 అడుగులు ఉన్న వంక మూడు అడుగులకు చేరింది. ఖనిమహల్, బార్‌పేట, వడ్డేగేరి, బోయగేరిలో నీరు పారేందుకు అవకాశం లేక ఇళ్ల మధ్యలోకి వచ్చాయి. అక్రమ కట్టడాలు కూల్చేసి వంకలను సంరక్షించాలి. వర్షం కురిసిన ప్రతిసారీ మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఎక్కువ రోజులు నీరు నిలుస్తూ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. నీరు ఎక్కువ రోజులు నిలవడం వల్ల కార్యాలయానికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పురవాసులు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలు గుర్తించాం

- కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్

పట్టణంలో ఆవదూడ వంక, మండగిరి వంకలను కుదించిన దాఖలాలు ఉన్నాయి. రాంజల నుంచి నీరు పొంగిపొర్లి వంక గుండా పారేందుకు చెత్తాచెదారాన్ని యంత్రాల ద్వారా తొలగించే పనులు చేసేందుకు చాలా ఆటంకాలు ఏర్పడ్డాయి. వంక, మురుగు కాలువలపై అక్రమ కట్టడాలు అక్కడక్కడ వెలిశాయని గుర్తించాం. టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి కట్టడాలు గుర్తించాలని సూచించాం. వారికి నోటీసులు పంపి తొలగించే దిశగా చర్యలు తీసుకుంటారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పల్లపు ప్రాంతం కావడంతో నీరు నిలుస్తోంది. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి నీరు నిలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

ఐలమ్మ పోరాటం ఆదర్శనీయం

- రజక సంఘం నాయకులు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో నివాళులర్పిస్తున్న నాయకులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాయకత్వం వహించిన వీర మహిళ చాకలి ఐలమ్మ ధైర్యం, త్యాగం ఆదర్శనీయమని రజక వృత్తిదారుల సంఘం నాయకులకు లక్ష్మన్న, మల్లికార్జున, నాగరాజు, మల్లి, వీరేష్ తెలిపారు. శుక్రవారం మడివాల మచిదేవుని గుడి దగ్గర రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి కురుకుంద నాగరాజు పులమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... ఐలమ్మ భూ సమస్యలు, భుక్తి, వెట్టి చాకిరి వంటి అంశాలకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. **మంత్రాలయం**లోని మాచిదేవ దేవాలయం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం నాయకులు చాకలి భీమయ్య, రమేష్, రాము, నరసప్ప, శీను, ఆంజనేయులు, నరేష్, అశోక్, రామాంజనేయులు, భీమా, అంజనప్ప పాల్గొన్నారు.

మంత్రాలయంలో...

యాత్ర నిర్వహిస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కార్పొరేట్లకు రూ.14.50 లక్షల కోట్లు మాఫీ

- రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.14.50 లక్షల కోట్లు మాఫీ చేసిందని కేంద్ర మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతామోహన్ తెలిపారు. కుప్పం నుంచి మొదలైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కర్నూలు నగరంలో ఆయన ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పేదలకు జన్‌ధన్ బ్యాంకు ఖాతాలను తెరిపించి ఒక్క రూపాయి కూడా వేయలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. నరేంద్ర మోడీ ఎన్నికల హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఏ ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని పేర్కొన్నారు. రష్యా నుంచి పెట్రోల్ ఉత్పత్తులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న సామాన్యులకు మాత్రం పెట్రోల్ చార్జీలు ధరలు లేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం అమరావతి పేరుతో పరిపాలన సాగించిందన్నారు. అదే తీరులోనే మళ్లీ ఇప్పుడు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని, మాల మాదిగల మధ్య తగాదా పెడుతున్నారని అన్నారు. ఎస్సీలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన రుణాలన్నిటిని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఅంబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అశోక్ రత్నం, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కర్నూలులో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

కుప్పం నుంచి మొదలైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎస్సీలను విభజించిందని పేర్కొన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎస్సీలు ఉన్నారని, వారిలో 800 ఉప కులాలు ఉన్నాయని తెలిపారు. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 86 ఉప కులాలు ఎస్సీల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులు హరించబడుతున్నాయన్నారు. దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ బాబు మాట్లాడుతూ దళిత క్రిస్టియన్లకు ఎస్‌సి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి నాయకులు అశోకరత్నం, పలువురు దళిత సంఘాలు నాయకులు, విద్యార్థి, యువజన సంఘం, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.